

4 లో

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :245 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 31 జూలై 2026 పేజీలు: 8 వెల:2


Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# దగదర్తి విమానాశ్రయం ఎందుకు ఆలస్యం అవుతోంది

పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

ఎయిర్‌పోర్టు నిర్మాణం లో ఆలస్యం, అభివృద్ధి పనుల గడువు పై వివరణ కోరిన ఎంపీ

మూడుసార్లు టెండర్లు పిలిచినా బిడ్లు ఖరారు కాలేదని స్పష్టం చేసిన కేంద్రం



ఢిల్లీ సింధూర దర్శిని

నెల్లూరు జిల్లాలోని దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న ఆలస్యం, టెండర్ల పురోగతి, మొదటి విడత పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చే సమయపరిమితిపై నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంటులో లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ గురువారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దగదర్తిలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం 2016లోనే సూత్రప్రాయంగా అనుమతి ఇచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు. పీపీపీ పద్ధతిలో విమానాశ్రయాన్ని నిర్మించేందుకు 2016 జూన్ 7న టెండర్లు పిలవగా, 2018 జూన్‌లో కన్సెషన్ ఒప్పందం కుదిరిందని.. అయితే ఎంపిక చేసిన బిడ్డర్ నిర్దేశిత గడువులోగా నిధుల సర్దుబాటు చేయలేకపోవడంతో 2020 లో ఆ ఒప్పందాన్ని రద్దు చేసినట్లు వివరించారు. ప్రైవేట్ భాగస్వామి ఎంపిక కోసం 2025 సెప్టెంబర్ 5న నూతన టెండర్ ప్రకటన విడుదల చేశారని తెలిపారు. 2026 మార్చి 5న రెండో సారి, 2026 మే 29న మూడో సారి టెండర్లు పిలిచినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి బిడ్లు ఖరారు కానట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ విధానం ప్రకారం, విమానాశ్రయ ప్రాజెక్టును అమలు చేసే బాధ్యత

మిగతా 2లో...

# మోదీ ఫేస్‌బుక్ పోస్టుపై ఆంక్షలు..

మెటాకు కేంద్రం మరోసారి సమన్లు - పూర్తి వివరణ కోరిన కేంద్ర ప్రభుత్వం

సాంకేతిక, విధానపర వివరణపై దృష్టి - సాంకేతిక లోపమే కారణమన్న మెటా

కొత్త భద్రతా విధానం అమల్లోకి తెచ్చిన సంస్థ - ఘటనను నిశితంగా పరిశీలిస్తున్న కేంద్రం



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టుపై తాత్కాలికంగా ఆంక్షలు విధించిన ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ)ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇందుకోసం మెటా సీనియర్ అధికారులను రానున్న ఏడు నుంచి పది రోజుల్లో హాజరు కావాలని కోరింది. ఘటన ఎలా జరిగింది, భవిష్యత్తులో మళ్లీ జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై మాట్లాడిన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్, మెటా నుంచి విధానపరంగా, సాంకేతికంగా పూర్తి వివరాలు కోరుతున్నామని తెలిపారు. ఈ ఘటన వెనుక ఉన్న కారణాలను పూర్తిగా తెలుసుకోవాలన్నదే కేంద్రం ఉద్దేశమని చెప్పారు. భారత ప్రభుత్వం తన ఆందోళనలను నేరుగా మెటా దృష్టికి తీసుకెళ్లి, ఈ తప్పిదం ఎలా జరిగిందో పూర్తి నివేదిక కోరుతోందని వెల్లడించారు.

మిగతా 2లో...

# '2034 వరకు నేనే సీఎం'..

ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ - టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం

విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు - 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య

ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం - ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ

**హైదరాబాద్, సింధూరదర్శిని:** విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను.

మిగతా 2లో...




# పరామర్శ పేరుతో బలప్రదర్శనలు

నిందితులను కాపాడటమే జగన్ రాజకీయమా?: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, సింధూరదర్శిని:** పరామర్శ పేరుతో రాజకీయ డ్రామాలు, బలప్రదర్శనలు చేయడం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నైజంగా మారి పోయిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. నేరస్తులను పరామర్శించేందుకు యాత్రలు చేస్తూ, అదే సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీలు నిర్వహించడం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమని అన్నారు. గొడ్డలి పార్టీ వ్యవహారం రోజు రోజుకూ దిగజారుతోందని, వారి బరితెగింపు, డ్రామాలు, పోకడలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఈరోజు ఒక నేరస్తుడిని పరామర్శించేందుకు మరో నేరస్తుడు చేపట్టిన డ్రామా యాత్ర ప్రజల్లో వెగటు పుట్టించిందన్నారు. ఒక తప్పును సమర్థించేందుకు వెళ్లి, అదే దారిలో తన సైకో మూకతో మరిన్ని తప్పులు చేయించడం జగన్ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

వైసీపీ అంటేనే క్రిమినల్స్‌ను తయారు

మిగతా 2లో...




# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయింది

త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు

పరిశ్రమలు తేవడం మా బాధ్యత - కష్టపడటం యువత బాధ్యత

టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్

**పత్తికొండ, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ఎంపిక అయ్యిందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, EQT, TPG వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ACME, వారీ వంటి ప్రముఖ భారతీయ కంపెనీలు ఇక్కడ విస్తరిస్తున్నాయని లోకేష్ వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరులో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (TPREL) ఆధ్వర్యంలో రూ. 5,350కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటుచేయబోయే 800 మెగావాట్ల క్లీన్‌ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ గత ఏడాది తో పోలిస్తే, ఈ ఒక్క సంవత్సరంలోనే ఆంధ్రప్రదేశ్ లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400% పెరిగిందని, ఇది రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే

మిగతా 2లో...

# చంపిన హంతకులను పరామర్శిస్తారా?

జగన్ పర్యటనపై మంత్రులు కొల్లు రవీంద్ర, సంధ్యారాణి తీవ్ర ఆగ్రహం

సీదిరి అప్పలరాజును జగన్ పరామర్శించడంపై మంత్రుల ఆగ్రహం

క్రిమినల్ మైండ్‌సెట్ ఉన్న వ్యక్తులు ఎలా ఉంటారో చెప్పేందుకు జగనే నిదర్శనమన్న కొల్లు రవీంద్ర

నేరస్తులకు జగన్ వంతపాడుతున్నారని మండిపాటు



**విజయవాడ, సింధూరదర్శిని:**

వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ చేసిన బైక్ యాక్సిడెంట్‌లో దానయ్య అనే గొర్రెల కాపరి మృతి చెందిన కేసులో అరెస్టయిన అప్పలరాజును వైసీపీ అధినేత జగన్ పరామర్శించడంపై ఏపీ మంత్రులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధితుడి

మిగతా 2లో...

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



### కమిషనర్ వై ఓ.నందన్

నెల్లూరు ( సింధూర దర్శిని) 30 జూలై నెల్లూరు జిల్లా ; కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ నిర్దేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ అన్ని విభాగాల కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని నారాయణ మెడికల్ కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని కార్యాలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ శిబిరంలో కార్యాలయం సిబ్బందికి అందుతున్న వైద్య సేవలను పరిశీలించి స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రత్యేకంగా నెల్లూరు నగరపాలక సంస్థ లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ విభాగం సిబ్బంది ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన " సఫాయీ అప్నావో - బీమారీ భగావో" నినాదంతో పారిశుధ్య కార్మికులంతా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని కొనసాగించేందుకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని తెలియజేశారు.ఉచిత వైద్య శిబిరం ద్వారా అందిస్తున్న నాణ్యమైన వైద్య పరీక్షలు, ఉచితంగా అందిస్తున్న మందుల సహకారంతో సిబ్బంది అందరూ తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని విధుల నిర్వహణలో పాల్గొనాలని కమిషనర్ సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలంతా వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సామాజిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత కల్పిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛ నెల్లూరు సాకారానికి సహకరించాలని కమిషనర్ ఆకాంక్షించారు.వైద్య శిబిరంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దినేష్, అదనపు కమిషనర్ హిమబిందు, నారాయణ మెడికల్ కళాశాల వైద్యులు సుభహాన్, ప్రీతి, ప్రగతి, శివప్రియ, సిబ్బంది నరసింహా రెడ్డి, నంద కిషోర్ పాల్గొన్నారు.

# యువతి యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి




శ్రీకాళహస్తి ( సింధూర దర్శిని) 30 జూలై తిరుపతి జిల్లా; ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ మరియు సీడాప్, జె కె సి సంయుక్త ఆధ్వర్యంలో బొజ్జల సుధీర్‌రెడ్డి శాసనసభ్యులు, శ్రీకాళహస్తి నియోజకవర్గం వారి ఆదేశాల మేరకు గురువారం ఉదయం 8 గంటల నుంచి శ్రీకాళహస్తి లోని ఎస్ వి ఏ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి నందు జాబ్ మేళా నిర్వహించడం జరిగినది. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథులుగా డా. ఆర్ వాణిశ్రీ , ప్రిన్సిపాల్ , ఎస్ వి ఏ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, శ్రీకాళహస్తి వారు జాబ్ మేళా ను ఉద్దేశించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జరిగే ఈ జాబ్ మేళా ను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని అదేవిధంగా ప్రస్తుత సంవత్సరం డిగ్రీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఇండస్ట్రీ కనెక్ట్ ఇంటర్న్‌షిప్ సదుపాయాలు కల్పిస్తున్నామని కావున జాబ్ మేళాకు హాజరైన యువతీ యువకులు అందరూ అన్ని కంపెనీలకు ఇంటర్వ్యూలకు హాజరై ఉద్యోగ అవకాశాలు పొందాలని తెలియజేశారు. ఆర్. లోకనాథం, డీఎస్డీవో, ఏపీ ఎస్ ఎస్ డి సి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఇక్కడ జాబ్ మేళా నిర్వహించడం జరిగినది అదే విధంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని కావున నియోజకవర్గ పరిధిలో ఉన్న యువతీ యువకులు ఈ జాబ్ మేళాని సద్వినియోగం చేసుకోని వారి బంగారు బాటలు వేసుకోవాలని తెలిపారు. జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన యువతీ యువకులకు ప్రిన్సిపాల్ మరియు డీఎస్డిఓ కాలేజీ సిబ్బంది ద్వారా ఆఫర్ లెటర్స్ అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ జాబ్ మేళాకి 13 బహుళ జాతీయ కంపెనీలు మెగా జాబ్ మేళాకు 343 మంది హాజరు అవ్వగా, వివిధ కంపెనీలకు ఉద్యోగానికి మరియు ఇతర ఇంటర్వ్యూ రౌండ్లకి 130 మంది అర్హత పొందడం జరిగినది తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ నరసింహులు , వైస్ ప్రిన్సిపాల్ ,ఎస్వీఏ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, నరసింహులు ,హెచ్ ఓ డి, ఎకనామిక్స్ డిపార్ట్మెంట్, మురళీకృష్ణ , ఏడిఎస్ డిఓ ఁ సిఆర్ఓ, సులేమాన్ భాష గారు ప్లేస్మెంట్ ఆఫీసర్, కళాశాల అధ్యాపక బృందం

# పంటల బీమా నమోదు ప్రక్రియ గడువు పెంచాలి




### సిపిఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య

బనగానపల్లె సింధూర దర్శిని

రాష్ట్రంలో పంటల భీమా నమోదు పక్రియ గురువారం తో ముగుస్తుండగా చాలామంది రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మీ సేవల దగ్గర సర్వర్ బిజీగా ఉండడం సైట్ ఓపెన్ కాకపోవడం కొన్ని టెక్నికల్ ఇబ్బందులతో చాలామంది రైతులు పంటల భీమా నమోదు చేసుకోలేకపోతున్నారు. కావున ఈ నమోదు కార్యక్రమాన్ని గడువు పెంచాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైతుల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాము. మీరాపురం కటికవానికుంట గ్రామాల్లో వర్షాలు లేక ఎండిపోతున్న పొలాలను పరిశీలించడం జరిగింది . ఎలినో ప్రభావం వల్ల వర్షాలు రాక రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. కొంత పొలం విత్తనాలు కూడా వేయని పొలాలు ఉన్నాయి. రైతు ఆకాశం వైపు వాన దేవుడా ఎప్పుడు వస్తావు అంటూ బిక్కు బిక్కుమంటూ ఆకాశం వైపు చూస్తున్నారు. ఇప్పటికే వర్షాలు లేక కంది , కొర్ర , మొక్కజొన్న , ఆముదాలు , మినుము , సద్ద ఎండిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి నేలపాలు అయిపోతుందని గుండెలు బాదుకుంటున్నారు. రైతు బనగానపల్లె పశ్చిమ వైపు ఉన్న గ్రామాల రైతులు వర్షాధారంపై ఆధారపడి పంటలు పండిస్తారు. కానీ ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు రాక వేసిన పంటలు ఎండి పోతున్నాయి . కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతే రాజు అని చెప్పడంలో కాదు రైతులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తా ఉన్నాం అని అన్నారు. పంటల భీమా నమోదు ప్రక్రియను గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు పలుకూరు శాఖ కార్యదర్శి బాలయ్య పాల్గొన్నారు.

# పేకాట స్థావరం పై పోలీసులు మెరుపు దాడి



కలిగిరి (సింధూర దర్శిని) 30 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లాలో పేకాట, గ్యాంబ్లింగ్ తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు గురువారం కలిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతంలో పేకాట స్థావరం పై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 4 గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3050/- నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ ఆపరేషన్‌లో ఆధునిక డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పేకాట స్థావరాన్ని గుర్తించి వేగంగా దాడి నిర్వహించడం జరిగింది. జిల్లాలో నేరాల నియంత్రణలో భాగంగా పోలీసు శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ చర్యలు చేపడుతోంది. ఈ సందర్భంగా జిల్లా పోలీసులు మాట్లాడుతూ, జిల్లాలో పేకాట, మట్కా, గ్యాంబ్లింగ్, కోడిపందేలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే డయల్-112 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 93929 03413కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడిలో కలిగిరి మహిళా సబ్ ఇన్స్పెక్టర్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# నిత్య అన్నదానానికి లక్ష రూపాయలు విరాళం

### సహాయక కమిషనర్ ఆర్యభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ఆలయ చైర్మన్ అశోక్ రెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం(సింధూరదర్శిని)30 జూలై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాలెం జొన్నవాడ క్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం నందు నెల్లూరు వాస్తవ్యులు తెలిదేవులపల్లి పాండు రంగయ్య వెంకట లక్ష్మమ్మ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు శాశ్వత నిత్య అన్నదానమునకు రూ. 1,00,000/- విరాళం దేవస్థాన కార్యాలయం లో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాత గోత్రనామ ములతో శ్రీ మల్లికార్జున స్వామి వారికి శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, శేష వస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదములు, డొనేషన్ బాండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు కీలుకప్పు శ్రీనివాసులు , మురళి రెడ్డి పాల్గొన్నారు .

# రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం



గూడూరు( సింధూర దర్శిని) 30 జూలై నెల్లూరు జిల్లా; తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి ప్రచారం కార్యక్రమం గూడూరు ఎమ్మెల్యే మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ మరియు 15వ యూనిట్ ఇంచార్జ్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ సూచనల ప్రకారం గురువారం గూడూరు పట్టణం లోని 27, 28 వ వార్డుల లోని 10, 11 బూత్ ల ఏరియా ల లోని ఎగువ, దిగువ వీరారెడ్డి పల్లి ప్రాంతాల నందు ఇంటింటికికరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాలలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గూర్చి ప్రచారం చేస్తూ ప్రజలకు వివరించడం నజరిగింది.ఈ ప్రచార కార్యక్రమం లో 15 వ యూనిట్ కో కన్వీనర్ యదనపర్తి మధు రెడ్డి, 11వ బూత్ కన్వీనర్ నూనె వాసు, టీడీపీ 27 వ వార్డు అధ్యక్షుడు అన్నంగి సుధాకర్, గూడూరు పట్టణ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ వేల్పుల రమేష్ కుమార్, 10 వ బూత్ కన్వీనర్ మగ్గం రాజేష్, స్థానిక టీడీపీ నాయకులు ఈరిబోయిన జయచంద్రయ్య, ఈరిబోయిన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ విద్యలో రాణించాలి




శ్రీకాళహస్తి (సింధూర దర్శిని) 30 జూలై తిరుపతి జిల్లా ; శ్రీకాళహస్తి రూరల్ మండలం ముచ్చువోలు జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో బెంగళూరు క్రై సంస్థ సహకారంతో ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహులు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ అక్రమ రవాణా జరిగే ప్రదేశాలు కారణాలు తెలుసుకొని ఎదుర్కోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బాలలపై జరుగుచున్న అక్రమ రవాణా అరికట్టాలంటే క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అధికారులతో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని అందరూ కలిసికట్టుగా పనిచేస్తే బాలలపై జరుగుతున్న లైంగిక దాడులు అత్యాచారాలు అరికట్టవచ్చునని తెలిపారు. బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపుల దాడులు అశ్లీలత గురించి క్లుప్తంగా వివరించారు. ప్రగతి స్వచ్ఛంద సంస్థ మహిళా కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ విద్యలో రాణించాలని కోరారు. బాలబాలికలు సమస్యలు ఏర్పడితే 1098 112 నెంబర్లకు కాల్ చేసి సమస్య నుండి బయట పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం శర్మ ప్రగతి స్వచ్ఛంద సంస్థసిబ్బంది రామచంద్ర మురగయ్య వెంకటేశు విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ కర్తవ్యం..!

### ఇంటింటికీ ప్రచారంలో బ్రహ్మారెడ్డికి బ్రహ్మారథం..!

దుర్గి సింధూరదర్శిని: అన్నివర్గాల ప్రజల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. గురువారం దుర్గి మండల పరిధిలో కోలగుట్ల, కంచరగుంట, ముటుకూరు, నెహ్రూనగర్ తండా గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం.., ప్రతి ఇంటికి జూలకంటి ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కు ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు బ్రహ్మారథం పట్టారు. అనంతరం స్థానిక ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్ చీ=, పార్టీ సీనియర్ నాయకులు తక్కెలపాటి రామకోటయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో సాధించిన ప్రగతి కర పత్రాలను ప్రజలకు అందజేశారు స్థానికంగా ఏ సమస్యఉన్న నేతల దృష్టికి తీసుకొస్తే., దానిని తక్షణమే పరిష్కరించి, ఇబ్బందులు తొలిగేలా చర్యలు తీసుకుంటనని హామీ ఇచ్చారు. అనంతరం కంచరగుంట గ్రామంలో రూ. 36 లక్షల నిధులతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి, అక్కడున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బందితో ముఖాముఖి నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి శంకర్,దుర్గి మార్కెట్ యార్డ్ చైర్మన్ లింగా బ్రహ్మయ్య, మండల పార్టీ అధ్యక్షులు జానకిరామయ్య, పార్టీ సీనియర్ నాయకులు లింగ రమేష్, గరిణే రమేష్, తక్కెలపాటి హనుమంతరావు, సింగు నాగేశ్వరరావు, భీమనబోయిన నాగేశ్వరరావు, పొన్నూరు ఆదం,దేవబిక్షం, కృష్ణ, కోటేశ్వరరావు, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు

## వినుకొండలో ఆలయ నిర్మాణం అభివృద్ధికి నిధుల మంజూరు

### హర్షం వ్యక్తం చేసిన భక్తులు

వినుకొండ- సింధూరదర్శిని: పట్టణంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కోట్ల నిధులను మంజూరు చేసినట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ నుండి ఉత్తర్వులు అందినట్లు వారు తెలిపారు ఈ ఉత్తరులలో నిధుల మంజూరు తో పాటు మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ గా గతంలో పేర్కొన్న రూ 1.32 కోట్ల కు బదులుగా 60 లక్షల రూపాయలకు తగ్గించినట్లుగా పేర్కొన్నారుసదరు అనుసరించి ఒక నెలరోజుల లోపు మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ జమ చేయా లని, అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ తీసుకోవడం, టెక్నికల్ శాంక్షన్ పూర్తి చేయడం తో పాటుగా టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. త్వరితగతిన నిధుల మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ చీఫ్విప్ వినుకొండ,శాసనసభ్యులు జీవి ఆంజనేయులుకు ఆలయ అభివృద్ధి కమిటీ తరఫున వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆవును (గోమాతను) కాపాడే ప్రయత్నంలో ఇద్దరు వేదవిద్యార్థుల మృతి

### అత్యంత విషాదకరం


### పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అమరావతి సింధూరదర్శిని: మండల పరిధిలోని యండ్రాయి గ్రామంలోని వేద పాఠశాలలో ఆవును ( గోమాతను) కాపాడే ప్రయత్నంలో చెరువులో మునిగి ఇద్దరు వేద విద్యార్థులు బమిడి శివనాగ సుబ్రహ్మణ్య మణిశర్మ (17), కొడవటికంటి కిరణ్ (18) ప్రమాదవశాత్తు మృతి చెందడం అత్యంత విషాదకరమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ మూగజీవాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ధైర్యంగా ముందుకు వెళ్లిన వేద విద్యార్థుల మానవత్వం, సేవాభావం అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అయితే అదే ప్రయత్నంలో వారి అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని భరించే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ ఘటనలో చికిత్స పొందుతున్న విద్యార్థి కాళేశ్వర సుప్రదీప్ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దుర్ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా విద్యాసంస్థలు, గోశాలలు, చెరువులు మరియు నీటి వనరుల పరిసర ప్రాంతాల్లో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు.

# నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్ వై ఓ.నందన్

నెల్లూరు ( సింధూర దర్శిని) 30 జూలై నెల్లూరు జిల్లా ; ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మరియు ఎంప్లాయిమెంట్ ఆఫీసు మరియు సీడాప్ సంయుక్తంగా 31-07-2026 శుక్రవారం నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కాలేజ్, హరనాథపురంలో ఉ.9:00 గశీ.నుండి సాయంత్రం 4:00 గం ..ల వరకు జాబ్ మేళాను నిర్వహించనున్నారు.ఈ జాబ్ మేళాలో సుమారుగా 15 కంపెనీలు ఇంటర్వ్యూలను నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారు. కావున నిరుద్యోగ యువత అశీదరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ వై. ఓ. నందన్ మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలియ జేసారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం విడుదల చేశారు.




కావున నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, ఏదైనా డిగ్రీ, పీజీ, బి.టెక్ చదివిన నిరుద్యోగ యువత అందరు ఈ సదవకాశాన్ని ఉపయోగిశీచుకోవచ్చును. ఈ జాబ్ మేళ లో పాల్గొను యువతీ యువకులు ఆదార్ కార్డ్ జెరాక్స్ , బయోడేటా / రెస్యూమ్ తీసుకురావలెను. మరిన్ని వివరములుకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు :8143227239, 9494456326, 9988853335, 8712655686, 8790118349, 8790117279 ను సంప్రదించండి. మరియు రిజిస్ట్రేషన్ కొరకు ఈ వెబ్సైట్ లో నమోదు చేసుకోవలసినదిగా ఈ సందర్భంగా తెలియజేసారు. https://naipunyam. ap.gov.in/user-registration


## గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి :కంకణాల పెంచలనాయుడు

గూడూరు (సింధూర దర్శిని) 30 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు ను జిల్లా చేయాలని గత 240 రోజులుగా గాంధీ బొమ్మ సెంటర్ లో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద కు గూడూరు ప్రజలు వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 5 మండలాలు కలిగిన మా గూడూరు ను 2 మండలాలుగా చేయడం వలన మా గూడూరు కు అన్యాయం జరిగింది అని మీరు వెంటనే మా గూడూరు ను జిల్లా గా ప్రకటించాలి అని గూడూరు జిల్లా పోరాట సమితి అధ్యక్షుడు కంకణాల పెంచల నాయుడు తెలిపారు . ఈ కార్యక్రమంలో యారం వెంకట సుబ్బయ్య ,మంజులమ్మ,శ్రీ గౌరి,ఎల్లసిరి సుబ్బారెడ్డి చిరంజీవి,కనగలూరు శేఖర్. తదితరులు పాల్గొన్నారు.




## రావిపాడులో చికెన్ వ్యర్థాల ఆటో స్వాధీనం.. మత్స్యశాఖ తీరుపై ఆరోపణలు

నరసరావుపేట సింధూరదర్శిని:
నరసరావుపేట మండలం: రావిపాడు గ్రామంలో అనుమతులు లేకుండా కోళ్ల మాంసం వ్యర్థాలను తరలిస్తున్న ఆటోను గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు స్వాధీనం చేసుకున్నారు. కోళ్ల వ్యర్థాలను సేకరించి పమిడిపాడు చెరువులో చేపలకు ఆహారంగా వేస్తున్నట్లు గుర్తించి, ఆటో డ్రైవర్ సాయి, యజమాని వెంకటేశ్వర్లును తీవ్రంగా మందలించారు. కోళ్ల మాంసం వ్యర్థాలను ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్స్యశాఖ తీరుపై ఆరోపణలుఈ ఘటనపై గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి మత్స్యశాఖ జిల్లా




అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ, సిబ్బందిని పంపుతున్నామని చెప్పి ఆలస్యం చేశారని ఆరోపించారు. చెరువుల్లో చేపలకు కోళ్ల మాంసం వ్యర్థాలను వేస్తున్నా, మత్స్యశాఖ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

కొంతమంది చెరువు యజమానులు, కోళ్ల మాంసం వ్యర్థాల సరఫరాదారుల నుంచి మత్స్యశాఖ సిబ్బంది లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



## ఇంటింటికీ సంక్షేమం అందించటమే ప్రభుత్వ ఆశయం

### మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్

రేపల్లె, జూలై 30 సింధూరదర్శిని: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సోదరులు శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని13వ వార్డులో గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి అర్హుల కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సమస్యలను తెలుసుకొని వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రేపల్లె నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించి రహదారులు, మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు వ్యక్తం చేస్తున్న విశ్వాసమే తమకు మరింత బాధ్యతను పెంచుతోందని, ఇదే ఆదరణను భవిష్యత్తులో కూడా అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని జయలక్ష్మి, సీనియర్ నాయకులు వెనిగళ్ల సుబ్రహ్మణ్యం కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఇంటింటికీ తెలుగుదేశం

పెదకూరపాడు సింధూరదర్శిని: రెండేళ్ల నమ్మకం అభివృద్ధి కార్యక్రమంలో పెద్దకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు గురువారం పెదకూరపాడు మండలంలోని ఖమ్మంపాడు పరస గ్రామాల్లో 184 185 192 బూతుల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య వారితోపాటు మండల టిడిపి నాయకులు గల్లా బాబు భాష్యం ఆంజనేయులు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్ మండల మహిళా నాయకురాలు కాంద్రు పద్మలత క్లస్టర్ ఇంచార్జ్ షేక్ అజిముల్లా మండల మహిళా అధ్యక్షురాలు సరిపుడి కృష్ణకుమారి గ్రామ పార్టీ అధ్యక్షులు పాపినేని గంగాధర్ సరిపూడి అనీలు సరిపుడి శివకృష్ణ సరిపూడి అమరయ్య ఆంధ్ర కొండలు ఆమనేని అనీలు నూతలపాటి అమరయ్య సరిపుడి శీను(తుఫాను) పోతుకుంట్ల అమరయ్య మాజీ సర్పంచ్ నంబూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## అచ్చంపేటలో ఇంటింటికీ తెలుగుదేశం

అచ్చంపేట, సింధూరదర్శిని: రెండేళ్ల నమ్మకం అభివృద్ధి కార్యక్రమం పెదకూరపాడుశాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు అచ్చంపేట లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జరిగింది సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రభుత్వ పథకాల గురించి అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం బత్తుల శీను బీసీ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు



# ఆరోగ్యానికి 4 ఇళ్లు.. మీ శరీరం చెప్పే రహస్యాలు ఇవే!


**ఆరోగ్యం అంటే కేవలం శారీరక దృఢత్వం కాదని నిపుణుల అభిప్రాయం**

**ఆధ్యాత్మిక, భావోద్వేగ, మానసిక, శారీరక అనే నాలుగు అంశాలపై ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని వివరణ**

**గతంలో పరిష్కారం కాని మానసిక గాయాలు.. భవిష్యత్తులో శారీరక రోగాలకు కారణం కావచ్చని హెచ్చరిక**

**దీర్ఘకాలిక ఒత్తిడి, క్యాన్సర్ వంటి వ్యాధులకు మధ్య సంబంధం ఉందని చెబుతున్న పరిశోధనలు**

**సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామంతో పాటు మానసిక ప్రశాంతత కూడా అత్యవసరమని స్పష్టీకరణ**



ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలని అడిగితే, చాలామంది చెప్పే సమాధానం... మంచి ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, తగినంత నిద్ర. ఇవి కచ్చితంగా ముఖ్యమైనవే. కానీ, అసలైన ఆరోగ్యం అంతకంటే లోతుగా ఉంటుందంటే నమ్ముతారా? మనం అణచివేసే భావోద్వేగాలే మన ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా శాసిస్తాయని ఎప్పుడైనా ఆలోచించారా? యూసీఎల్ఏ హెల్త్‌లో రేడియేషన్ ఆంకాలజిస్ట్ అయిన డాక్టర్ రాయ్ వోంగ్‌టామా సరిగ్గా ఇదే విషయాన్ని వివరిస్తున్నారు.

**ఆరోగ్యానికి నాలుగు ఇళ్ల నమూనా**

'మెడికల్లీ స్పీకింగ్' అనే పాడ్‌కాస్ట్‌లో డాక్టర్ వోంగ్‌టామా "4 హౌసెస్" (నాలుగు ఇళ్లు) అనే ఒక కొత్త ఆరోగ్య నమూనాను పంచుకున్నారు. దీని ప్రకారం ఆరోగ్యం అనేది కేవలం శారీరక అంశం కాదు. ఆధ్యాత్మిక, భావోద్వేగ, మానసిక, శారీరక అనే నాలుగు పొరల కలయిక. ఈ నాలుగు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. ఎప్పుడైతే భావోద్వేగ గాయాలు పరిష్కారం కాకుండా మిగిలిపోతాయో, అవి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపి, చివరికి శారీరక అనారోగ్యాలకు కూడా దారితీస్తాయని ఆయన విశ్లేషించారు. ఆయన చెప్పిన ఈ నాలుగు ఇళ్లను ఒకదానిలో ఒకటి ఉన్న వృత్తాలుగా ఊహించుకోవచ్చు. కేంద్రంలో ఉండేది ఆధ్యాత్మిక ఇల్లు. ఇది మతానికి సంబంధించింది కాదు, మన ఉనికికి, గుర్తింపునకు పునాది లాంటిది. దాని చుట్టూ భావోద్వేగాల ఇల్లు ఉంటుంది. ప్రేమ, బాధ, భయం, కోపం వంటివి ఇక్కడే అనుభవంలోకి వస్తాయి. ఆ తర్వాత పొర మానసిక ఇల్లు. ఇందులో మన ఆలోచనలు, నమ్మకాలు, నిర్ణయాలు ఉంటాయి. ఇక చివరగా బయట ఉండేది శారీరక ఇల్లు. మన శరీరం, కదలికలు, అనారోగ్యాలు, కోలుకోవడం వంటివన్నీ దీని కిందకే వస్తాయి. లోపలి పొరలైన భావోద్వేగ, మానసిక స్థితుల్లో వచ్చే మార్పులు చివరికి భౌతిక రూపంలో బయటపడతాయి.

**దాచిపెట్టిన భావోద్వేగాలు మాయమవ్వవు**

డాక్టర్ వోంగ్‌టామా చెప్పిన ఒక ముఖ్యమైన విషయం ఎందరినో ఆలోచింపజేస్తోంది. "లోపలికి వచ్చింది ఏదైనా సరే, అది బయటకు పోకపోతే అక్కడే పేరుకుపోతుంది" అని ఆయన అంటారు. చిన్నతనంలో ఎదురైన ఒక బాధాకరమైన సంఘటనను సరిగ్గా ఎదుర్కోకపోతే, ఆ ప్రభావం 50 ఏళ్ల వయసులో కూడా మనపై ఉంటుంది. ఒత్తిడి ఎదురైనప్పుడు మనం ఎలా స్పందిస్తామో కూడా ఇది నిర్ణయిస్తుంది. పరిష్కారం కాని మానసిక గాయాలు ఆందోళనను పెంచుతాయని, సంబంధాలను దెబ్బతీస్తాయని మనస్తత్వవేత్తలు ఎప్పటినుంచో చెబుతున్నారు.

**పరిశోధనలు ఏం చెబుతున్నాయి?**

చిన్ననాటి మానసిక గాయాలకు, క్యాన్సర్ వంటి వ్యాధులకు బలమైన సంబంధం ఉందని డాక్టర్ వోంగ్‌టామా పేర్కొన్నారు. దీనిపై శాస్త్రీయ పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల విడుదలయ్యే హార్మోన్లు, శరీరంలో వాపు (ఇన్‌ఫ్లమేషన్), నిద్రలేమి, చెడు ప్రవర్తన వంటివి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే, మానసిక గాయమే వ్యాధికి ఏకైక కారణం కాదు, అది ఒక ముఖ్యమైన కారకం మాత్రమే.

**గాయాలను మర్చిపోవడం కాదు.. పరిష్కరించుకోవాలి**

గాయాలను పక్కనపెట్టి ముందుకు సాగడమే ధైర్యం అని చాలామంది అనుకుంటారు. కానీ, వాటిని అంగీకరించి, పరిష్కరించుకోవడమే అసలైన స్వస్థత. దీనికోసం థెరపీ, నమ్మకమైన స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడటం, ధ్యానం, రాయడం వంటివి సహాయపడతాయి. ఇవి గతాన్ని చెరిపేయవు, కానీ వర్తమానంపై దాని పట్టును తగ్గిస్తాయి. సంపూర్ణ ఆరోగ్యం కేవలం శారీరక అలవాట్లతోనే సాధ్యం కాదు. రోజూ వ్యాయామం చేసినా, దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల శరీరం విశ్రాంతి తీసుకోలేకపోవచ్చు. మంచి ఆహారం తీసుకున్నా, భావోద్వేగ బరువులు నిద్రను, సంబంధాలను దెబ్బతీయవచ్చు. అందుకే, కేవలం శరీరం గురించే కాకుండా, మనసులోని భావోద్వేగాల గురించి కూడా శ్రద్ధ తీసుకోవడం సంపూర్ణ ఆరోగ్యానికి తొలిమెట్టు.



## కంటి నిండా నిద్రపోయాక కూడా నీరసంగా ఉంటోందా?

– కారణం ఇదే కావొచ్చు!

**–రోజూ 8 గంటలు నిద్రపోయినా నీరసంగా అనిపిస్తోందా?**

**–శక్తి ఉత్పత్తి, నరాల ఆరోగ్యానికి విటమిన్ దీ12 కీలకం**

**–చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, మతిమరుపు వంటివి సాధారణ లక్షణాలు**

**–శాకాహారులు, వృద్ధుల్లో ఈ లోపం ఎక్కువగా కనిపించే అవకాశం**

రోజంతా చురుగ్గా పనిచేసి, రాత్రి వేళ ఎనిమిది గంటల పాటు హాయిగా నిద్రపోయినప్పటికీ, ఉదయం నిద్రలేవగానే నీరసంగా, అలసటగా అనిపిస్తోందా? చాలామందిని వేధిస్తున్న ఈ సమస్యకు విటమిన్–దీ12 లోపం ఒక ప్రధాన కారణం కావచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తి, నరాల పనితీరు, డీఎన్ఏ సంశ్లేషణలో విటమిన్ దీ–12 కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్ సరఫరా చేసే ప్రక్రియలకు ఇది ఎంతో అవసరం. సాధారణంగా ఈ విటమిన్ లోపం నెమ్మదిగా మొదలవుతుంది, కాబట్టి లక్షణాలు తీవ్రమయ్యే వరకు దీనిని తరచూ గుర్తించలేరు.

**ప్రధాన లక్షణాలు ఇవే:**

నిరంతర అలసట, కాళ్లు–చేతుల్లో తిమ్మిర్లు లేదా స్పర్శ కోల్పోవడం, ఏకాగ్రత లోపించడం, మతిమరుపు, చర్మం పాలిపోవడం లేదా పసుపు రంగులోకి మారడం, తల తిరగడం, మానసిక స్థితిలో మార్పులు, నాలుక నునుపుగా మారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి దీని ప్రధాన లక్షణాలు.

**ఎవరిలో ఎక్కువంటే:**

ముఖ్యంగా సంపూర్ణ శాకాహారం (వేగన్) పాటించేవారు, కొన్ని రకాల జీర్ణ సంబంధిత వ్యాధులు (క్రోన్స్, సీలియాక్) ఉన్నవారు, మెట్‌ఫార్మిన్ వంటి మందులు వాడేవారు, వయసు పైబడిన వారిలో ఈ విటమిన్ లోపం అధికంగా కనిపిస్తుంది. సాల్మన్, ట్యూనా వంటి చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, ఫోర్టిఫైడ్ సెరియల్స్‌లో దీ12 సమృద్ధిగా లభిస్తుంది.

సాధారణ రక్త పరీక్ష ద్వారా దీ12 లోపాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఆహారపు అలవాట్లలో మార్పులు లేదా వైద్యుల సూచన మేరకు సప్లిమెంట్ల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. అయితే, అలసటకు ఐరన్ లోపం, థైరాయిడ్ సమస్యలు వంటి ఇతర ఆరోగ్య కారణాలు కూడా ఉండవచ్చు. కాబట్టి, సమస్య తీవ్రంగా ఉంటే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

## పాదయాత్రను వాయిదా వేస్తున్నా: అంబటి రాంబాబు

అమరావతి, సింధూరదర్శిని:తన నివాసంపై జరిగిన దాడికి సంబంధించి నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ తలపెట్టిన 'వినతి యాత్ర' పాదయాత్రను మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తాత్కాలికంగా వాయిదా వేశారు. గుంటూరులోని తన నివాసంలో పార్టీ నేతలతో అత్యవసరంగా సమావేశమైన అనంతరం ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. త్వరలోనే పాదయాత్రకు సంబంధించి కొత్త తేదీని ప్రకటిస్తానని తెలిపారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... ఆగస్టు 7, 8 తేదీల్లో గుంటూరులోని తన నివాసం నుంచి మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం వరకు రెండు రోజుల పాటు ఈ నిరసన పాదయాత్ర చేపట్టాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వైసీపీ అదే సమయంలో రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. పార్టీ అధిష్ఠానం చేపడుతున్న ముఖ్యమైన నిరసన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, తన సొంత పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు అంబటి స్పష్టం చేశారు.

# ఒకప్పుడు ప్రపంచంలో ఇన్ని భాషలు ఉండేవా?

**వేల ఏళ్ల క్రితమే ప్రపంచంలో భాషల స్వర్ణయుగం – ఒకప్పుడు 75,000 వరకు భాషలు ఉండేవని పరిశోధనలో అంచనా**


**సామ్రాజ్యాల విస్తరణతోనే భాషల క్షీణత మొదలు – వలసవాదం ఈ క్షీణతను వేగవంతం చేసిందే తప్ప, ప్రారంభించలేదు**

**ప్రస్తుతం ఉన్న భాషల్లో సగం అంతరించిపోయే ప్రమాదం**

ప్రపంచవ్యాప్తంగా ఒకప్పుడు 75 వేలకు పైగా ఉన్న భాషలు, గడిచిన కొన్ని వేల ఏళ్లలో భారీగా క్షీణించాయని ఓ నూతన అధ్యయనం వెల్లడించింది. మానవ చరిత్రలో భాషా వైవిధ్యం కొన్ని వేల సంవత్సరాల క్రితమే గరిష్ఠ స్థాయికి చేరుకుని, ఆ తర్వాత వేగంగా పతనమైందని ఈ పరిశోధన తేల్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 7,500 భాషలు వాడుకలో ఉండగా, ఇది చారిత్రక గరిష్ఠంతో పోలిస్తే చాలా తక్కువ అని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

పరిశోధకులు డేమియన్ బ్లాసి, క్లైర్ బోవెర్న్ నేతృత్వంలోని బృందం గత 12,000 సంవత్సరాల మానవ చరిత్రలో భాషల సంఖ్య ఎలా మారుతూ వచ్చిందో గణిత నమూనాల ద్వారా అంచనా వేసింది. సుమారు 12,000 ఏళ్ల క్రితం, మానవులు వేట, సేకరణ జీవన విధానంలో ఉన్నప్పుడు 4,500 నుంచి 6,200 భాషలు వాడుకలో ఉండేవని అంచనా. వ్యవసాయం ప్రారంభమై, జనాభా పెరిగి, స్థిర నివాసాలు ఏర్పడ్డాక భాషల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సుమారు 1,000 నుంచి 3,000 ఏళ్ల క్రితం భాషల స్వర్ణయుగం నడిచిందని, ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా 30,000 నుంచి 75,000కు పైగా భాషలు వాడుకలో ఉండేవని ఈ నమూనాలు సూచిస్తున్నాయి.

అయితే, ఈ స్వర్ణయుగం తర్వాత భాషల సంఖ్య గణనీయంగా క్షీణించడం మొదలైంది. ప్రాచీన కాలంలో పెద్ద రాష్ట్రాలు, బహుళజాతి సామ్రాజ్యాల విస్తరణే దీనికి ప్రధాన కారణమని పరిశోధకులు గుర్తించారు. ఆయా సామ్రాజ్యాలు తమ భాషలను రుద్దడంతో స్థానిక భాషలు




కనుమరుగయ్యాయి. సుమారు 500 ఏళ్ల క్రితం మొదలైన యూరోపియన్ వలసవాదం ఈ క్షీణతను మరింత వేగవంతం చేసిందే తప్ప, దానికి ఆద్యం పోయలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. చాలామంది భావిస్తున్నట్టుగా వలసవాదంతోనే భాషల వినాశనం మొదలవలేదని ఈ అధ్యయనం తేల్చింది.

ప్రాచీన కాలానికి సంబంధించిన రాతపూర్వక ఆధారాలు లేకపోవడంతో, పరిశోధకులు ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియాలోని 171 ఆదిమ సమాజాల డేటాను విశ్లేషించి ఈ అంచనాలకు వచ్చారు. "కొన్ని వేల సంవత్సరాల క్రితం వరకు మానవత్వం చాలా విభిన్నమైన సాంస్కృతిక ప్రపంచంలో నివసించిందనే విషయాన్ని మనం అంగీకరించాలి" అని ప్రధాన పరిశోధకుడు డేమియన్ బ్లాసి అన్నారు.

ప్రస్తుతం వాడుకలో ఉన్న భాషల్లో సగం అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని, ప్రపంచ జనాభాలో 90 శాతం మంది కేవలం 10 శాతం భాషలనే మాట్లాడుతున్నారని ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. "నేడు మనం చూస్తున్న భాషలు చరిత్రలో జరిగిన అతిపెద్ద వినాశనం నుంచి బయటపడినవి మాత్రమే. భాషల అంతర్ధానం మనం ఊహించిన దానికంటే చాలా తీవ్రంగా జరిగింది" అని సహ పరిశోధకుడు రస్సెల్ గ్రే పేర్కొన్నారు. భాషలు కేవలం సంభాషణకే కాదని, అవి సమాజాల జ్ఞానాన్ని, జ్ఞాపకాలను, సంస్కృతిని మోస్తాయని పరిశోధకులు గుర్తుచేశారు.

# ఆగస్ట్ 12న సంపూర్ణ సూర్యగ్రహణం.. కానీ భారత్‌లో కనిపించదు!

**ఆగస్ట్ 12, 2026న సంపూర్ణ సూర్యగ్రహణం**

**రాత్రి సమయంలో గ్రహణం ఏర్పడటంతో భారత్‌లో కనిపించదు**

**నాసా లైవ్ స్ట్రీమ్ ద్వారా వీక్షించే అవకాశం**



2026 ఆగస్టు 12న సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఖగోళ శాస్త్రవేత్తలు, ఔత్సాహికులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ అరుదైన దృశ్యం భారతదేశంలో మాత్రం కనిపించదు. మన దేశంలో ఆ సమయానికి రాత్రి అవుతుండటమే ఇందుకు ప్రధాన కారణం.దసూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు అడ్డుగా వచ్చినప్పుడు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడుతుంది. చంద్రబింబం సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో పగటిపూట కూడా ఆకాశం చీకటిగా మారి, ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ సమయంలో నక్షత్రాలు, గ్రహాలు కూడా స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది. నాసా శాస్త్రవేత్తల కథనం ప్రకారం, సూర్యుడు చంద్రుడి కంటే 400 రెట్లు పెద్దదైనప్పటికీ, అదే స్థాయిలో (400 రెట్లు) దూరంగా ఉండటం వల్ల ఆకాశంలో చంద్రుడు, సూర్యుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపిస్తాయి.

ఈ సంపూర్ణ గ్రహణం గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, స్పెయిన్, పోర్చుగల్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు ఉత్తర రష్యా, అట్లాంటిక్ మహాసముద్రం పరిధిలో కనిపిస్తుంది. ఇక ఉత్తర అమెరికా, కెనడా, యూరప్, వాయువ్య ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణాన్ని వీక్షించే అవకాశం ఉంది. భారత కాలమానం ప్రకారం, ఆగస్టు 12 రాత్రి 9:45 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రహణం, ఆగస్టు 13 తెల్లవారుజామున 2:15 గంటల వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో మన దేశంలో సూర్యరశ్మి ఉండదు కాబట్టి గ్రహణాన్ని వీక్షించే వీలు లేదు. అందువల్ల, గ్రహణం సమయంలో పాటించే సూతక్ కాలం వంటి సాంప్రదాయ నియమాలు మనకు వర్తించవని పండితులు స్పష్టం చేస్తున్నారు. అయితే, ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించాలనుకునే భారతీయులు నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ వంటి సంస్థల అధికారిక వెబ్‌సైట్లు, యూట్యూబ్ ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడవచ్చు.

# సమాధుల మధ్య టీ, టిఫిన్..

75 ఏళ్లుగా జనాలతో కిటకిటలాడుతున్న రెస్టారెంట్.. ఎక్కడో తెలుసా? – అహ్మదాబాద్‌లో 26 సమాధుల మధ్య నడుస్తున్న న్యూ లక్కీ రెస్టారెంట్

ఇవి 16వ శతాబ్దానికి చెందిన సూఫీ సాధువుల సమాధులని నమ్మకం – ఇక్కడ టీ తాగితే మంచి జరుగుతుందని స్థానికుల బలమైన విశ్వాసం

సమాధులను రోజూ శుభ్రపరిచి, పూలతో అలంకరించి ప్రార్థనలు – ఈ హోటల్‌ను పలువురు ప్రముఖులు సైతం సందర్శించిన వైనం



అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజా ప్రాంతంలో ఒక రెస్టారెంట్ ఉంది. దాని పేరు 'న్యూ లక్కీ రెస్టారెంట్'. బయటకు సాధారణ హోటల్‌లా కనిపించినా లోపలికి వెళితే ఆశ్చర్యం కలుగుతుంది. ఎందుకంటే.. అక్కడ కస్టమర్లు కూర్చునే టేబుళ్ల మధ్యలో ఏకంగా 26 సమాధులు ఉన్నాయి. గత 75 ఏళ్లుగా ఈ రెస్టారెంట్ ఇలాగే నడుస్తోంది. అయినా సరే, ఇక్కడికి వచ్చే జనం ఏమాత్రం తగ్గలేదు.ఆ రెస్టారెంట్ ఏర్పాటు వెనుక ఒక ఆసక్తికర కథ ఉంది. సుమారు 75 ఏళ్ల క్రితం కృష్ణన్ కుట్టీ అనే వ్యక్తి ఈ స్థలాన్ని కొనుగోలు చేసి, రెస్టారెంట్ నిర్మాణం మొదలుపెట్టారు. ఆ సమయంలో అక్కడ ఈ సమాధులు బయటపడ్డాయి. ఇవి 16వ శతాబ్దానికి చెందిన సూఫీ సాధువులు, వారి బంధువులవని స్థానికులు నమ్ముతారు. వాటిని తొలగించడం ఇష్టంలేని కుట్టీ, వాటి చుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసి, వాటి మధ్య ఖాళీ ప్రదేశంలో టేబుళ్లు వేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఇప్పటికీ ఆ సమాధులను ఎంతో గౌరవంగా చూసుకుంటున్నారు. ప్రతిరోజూ వాటిని శుభ్రపరిచి, తాజా పూలు ఉంచి, ప్రార్థనలు చేస్తారు. దీనికి సమీపంలోనే ఒక దర్గా కూడా ఉంది.

ఈ రెస్టారెంట్ మసాలా చాయ్, బన్ మస్కాకు చాలా ప్రసిద్ధి. స్థానిక కుటుంబాలు, ఉద్యోగులు, విద్యార్థులు, పర్యాటకులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల వారు ఇక్కడికి వస్తుంటారు. ఏదైనా ముఖ్యమైన పని, పరీక్ష లేదా శుభకార్యానికి వెళ్లే ముందు ఇక్కడ టీ తాగితే అదృష్టం కలిసి వస్తుందని చాలామంది బలంగా నమ్ముతారు. ఈ సమాధుల వల్లే తమ వ్యాపారం ఇంతగా వృద్ధి చెందిందని యజమానులు కూడా చెబుతుంటారు. కాలక్రమేణా ఈ రెస్టారెంట్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ప్రముఖ టీవీ షో 'తారక్ మెహతా కా ఉల్టా చష్మా'లో దీనిని చూపించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వంటి ప్రముఖులు కూడా ఈ హోటల్‌ను సందర్శించారు. చారిత్రక సమాధులను గౌరవిస్తూ, వాటి మధ్యలో దైనందిన వ్యాపారం కొనసాగించడం ఈ రెస్టారెంట్ ప్రత్యేకత. అందుకే ఇది అహ్మదాబాద్‌లోని ఒక విలక్షణమైన ప్రదేశంగా నిలిచిపోయింది.

# పండ్లు, కూరగాయలు ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే.. కొన్ని సింపుల్ చిట్కాలు!

ప్రతి పండు, కూరగాయ నిల్వ కాలం వేరు – సరైన నిల్వతో ఎక్కువ రోజులు తాజాదనం

బూజు పట్టిన బెర్రీలు, ద్రాక్ష పారేయడం మంచిది – మొలకెత్తిన బంగాళాదుంపలు వాడొద్దు

యాపిల్స్, అరటిపండ్లను ఇతర పండ్లతో ఉంచొద్దు – అవసరమైనంత మాత్రమే కొనడం ఉత్తమం



మార్కెట్ నుంచి తెచ్చిన పండ్లు, కూరగాయలు రెండు రోజుల్లోనే పాడైపోతుంటే బాధగా అనిపిస్తుంది. సరైన విధంగా నిల్వ చేయకపోవడమే దీనికి ప్రధాన కారణం. ప్రతి పండు, ప్రతి కూరగాయ నిల్వ కాలం ఒకేలా ఉండదు. ఉష్ణోగ్రత, తేమ, గాలి, వెలుతురు, పక్కన ఉంచే ఇతర పండ్లు కూడా వాటి తాజాదనాన్ని ప్రభావితం చేస్తాయి. ఇండియా టుడే కథనం ప్రకారం... కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఆహార వృథాలు తగ్గడంతో పాటు ఆరోగ్య సమస్యల ప్రమాదం కూడా తగ్గుతుంది.గది ఉష్ణోగ్రతలో యాపిల్స్ వారం రోజుల వరకు తాజాగా ఉంటాయి. ఫ్రిజ్‌లో పెడితే మూడు నుంచి నాలుగు వారాల వరకు నిల్వ ఉంటాయి.

అరటిపండ్లు రెండు నుంచి ఏడు రోజుల వరకు బయటే ఉంచాలి. పూర్తిగా పండిన తర్వాతే ఫ్రిజ్‌లో పెట్టాలి. బెర్రీలు మూడు నుంచి ఏడు రోజుల వరకు ఫ్రిజ్‌లో తాజాగా ఉంటాయి. వాటిని కడగకుండా నిల్వ చేసి, తినే ముందు మాత్రమే శుభ్రం చేయాలి.

నారింజ, బత్తాయి వంటి సిట్రస్ పండ్లు బయట వారం రోజులు, ఫ్రిజ్‌లో నెల రోజుల వరకు నిల్వ ఉంటాయి.

ద్రాక్ష రెండు వారాల వరకు ఫ్రిజ్‌లో తాజాగా ఉంటుంది. టమాటాలను ముందుగా బయట పండించి, తర్వాత ఫ్రిజ్‌లో పెడితే రెండు వారాల వరకు నిల్వ ఉంటాయి. కూరగాయల్లో క్యారెట్, పార్స్‌నిప్‌లు చల్లని ప్రదేశంలో రెండు వారాలు, ఫ్రిజ్‌లో నెలకుపైగా తాజాగా ఉంటాయి. దోసకాయను ఫ్రిజ్‌లో వారం రోజుల వరకు నిల్వ చేయొచ్చు. కోసిన తర్వాత మాత్రం ఒకటి లేదా రెండు రోజుల్లోనే వాడేయాలి.

లెట్యూస్ మూడు నుంచి ఏడు రోజులు ఫ్రిజ్‌లో నిల్వ ఉంటుంది. పుట్టగొడుగులు బయట ఒక రోజు మాత్రమే తాజాగా ఉంటాయి. ఫ్రిజ్‌లో మూడు నుంచి ఏడు రోజులు నిల్వ ఉంటాయి.

ఉల్లిపాయలను చల్లగా, పొడిగా, గాలి బాగా వచ్చే చోట ఉంచితే ఆరు వారాలకుపైగా నిల్వ ఉంటాయి. బంగాళాదుంపలు కూడా చీకటి, పొడి ప్రదేశంలో ఆరు వారాలకుపైగా తాజాగా ఉంటాయి.

అన్ని పండ్లు, కూరగాయలు కొద్దిగా మెత్తబడితే పారేయాల్సిన అవసరం లేదు. స్వల్పంగా దెబ్బతిన్న యాపిల్స్, గోధుమరంగులోకి మారిన అరటిపండ్లు, మెత్తబడిన టమాటాలు బూజు పట్టకపోతే తినవచ్చు. అయితే బెర్రీలు, ద్రాక్షపై బూజు కనిపిస్తే మొత్తం పారేయడం మంచిది. ఎందుకంటే బూజు విషపదార్థాలు మిగతా పండ్లకూ వ్యాపించే అవకాశం ఉంటుంది.

ఆకుపచ్చగా మారిన లేదా మొలకెత్తిన బంగాళాదుంపలను అసలు వాడకూడదు. వాటిలో ఉండే సహజ విషపదార్థాలు వంట చేసినా పూర్తిగా తొలగిపోవు.

పండ్లు, కూరగాయలు ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే కొన్ని చిట్కాలు తప్పనిసరి. వాటికి తగిన ఉష్ణోగ్రతలోనే నిల్వ చేయాలి. నిల్వ చేసే ముందు కడగకుండా, తినే ముందు మాత్రమే శుభ్రం చేయాలి. ఉల్లిపాయలను బంగాళాదుంపలతో కలిపి ఉంచకూడదు. యాపిల్స్, అరటిపండ్లను ఇతర పండ్లకు దూరంగా ఉంచాలి. ఎందుకంటే అవి విడుదల చేసే ఇథిలీన్ వాయువు మిగతా పండ్లు త్వరగా పండిపోయి పాడవడానికి కారణమవుతుంది. అవసరానికి తగ్గట్టే కొనుగోలు చేస్తే ఆహార వృథాలు కూడా గణనీయంగా తగ్గుతాయి.

# సెన్సెక్స్ 274 పాయింట్లు జంప్.. 24,300 పైన ముగిసిన నిఫ్టీ

లాభాలతో ముగిసిన దేశీయ మార్కెట్లు


77,928 వద్ద స్థిరపడ్డ సెన్సెక్స్

ఆటో షేర్లతో మార్కెట్‌కు మద్దతు

రియాల్టీ, కెమికల్ రంగాల్లో నష్టాలు

పశ్చిమాసియా పరిణామాలపై ఇన్వెస్టర్ల దృష్టి

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. పశ్చిమ ఆసియాలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో రోజంతా ట్రేడింగ్ పరిమిత శ్రేణిలో సాగింది. ఆటో రంగ షేర్లకు వచ్చిన కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 273.55 పాయింట్లు లేదా 0.35 శాతం పెరిగి 77,928.15 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 66.95 పాయింట్లు లేదా 0.28 శాతం లాభపడి 24,317.15 వద్ద ముగిసింది. రోజంతా




ఒడుదొడుకులు కనిపించినా చివర్లో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు గ్రీన్‌లో నిలిచాయి. నిఫ్టీలో మహీంద్రా అండ్ మహీంద్రా, కోల్ ఇండియా, ఐషర్ మోటార్స్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. ఈ షేర్ల బలమైన ప్రదర్శనతో మార్కెట్‌కు ఊతం లభించింది.

మరోవైపు విస్తృత మార్కెట్‌లో మాత్రం బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.35 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.56 శాతం నష్టపోయాయి.

రంగాల వారీగా చూస్తే రియాల్టీ సూచీ అత్యధికంగా రెండు శాతం పడిపోయింది. కెమికల్ రంగ సూచీ కూడా నష్టాల్లో ముగిసింది. అయితే ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలకు కొనుగోళ్లు రావడంతో మార్కెట్‌కు మద్దతు లభించింది. ఇతర రంగాల్లో బలహీనత ఉన్నా ఈ రంగాల ప్రదర్శన వల్ల సూచీల పతనం తప్పింది. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం నిఫ్టీకి 24,300–24,400 స్థాయులు కీలక నిరోధక పరిధిగా ఉన్నాయి. ఈ స్థాయిని నిలకడగా దాటితే 24,500–24,600 స్థాయుల దిశగా మార్కెట్ కదిలే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పశ్చిమ ఆసియా పరిణామాలపై ఇన్వెస్టర్ల దృష్టి కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో మార్కెట్ ఒడుదొడుకులు కొనసాగొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# దోమలతోనే దోమల నిర్మూలన.. సూపర్ సక్సెస్ అయిన ప్రయోగం!


దోమల నిర్మూలనకు అమెరికాలో సరికొత్త పర్యావరణ హిత ప్రయోగం

ల్యాబ్‌లో పెంచిన 6 లక్షల వోల్బాకియా బ్యాక్టీరియా దోమల విడుదల

ఈ మగ దోమలు కలిస్తే ఆడ దోమల గుడ్లు పొదగవు

రసాయనాలకు బదులుగా ఈ టెక్నాలజీపై పెరుగుతున్న ఆసక్తి

సింగపూర్‌లో 90% విజయవంతమైన ఈ పద్ధతిపై గూగుల్ కూడా ఆసక్తి



రసాయన పురుగు మందుల వాడకం లేకుండా దోమల జనాభాను నియంత్రించేందుకు అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ వేసవిలో సుమారు 6 లక్షల మగ దోమలను పరిసర ప్రాంతాల్లోకి వదులుతున్నారు. అయితే ఇవి సాధారణ దోమలు కావు. ప్రయోగశాలలో ప్రత్యేకంగా పెంచి, 'వోల్బాకియా' అనే సహజ సిద్ధమైన బ్యాక్టీరియాతో ఇన్ఫెక్ట్ చేసినవి. ఈ మేరకు బీబీసీ తన కథనంలో వెల్లడించింది.

### ఎలా పనిచేస్తుందంటే?

ల్యాబ్‌లో వోల్బాకియా బ్యాక్టీరియాను ఎక్కించిన మగ దోమలను బయటకు వదులుతారు. ఇవి అడవిలో ఉండే ఆడ దోమలతో జత కడతాయి. ఆ సంపర్కం అనంతరం, ఆడదోమలు పెట్టే గుడ్లు పొదిగే సామర్థ్యాన్ని కోల్పోతాయి. ఫలితంగా కొత్త దోమల ఉత్పత్తి ఆగిపోయి, క్రమంగా వాటి జనాభా తగ్గిపోతుంది. ఈ ప్రయోగంలో కేవలం మగ దోమలను మాత్రమే విడుదల చేస్తున్నందున అవి మనుషులను కుట్టడం గానీ, రక్తాన్ని పీల్చడం గానీ చేయవు. కాబట్టి ప్రజలకు ఎలాంటి హానీ ఉండదు.

### ప్రైవేట్ సంస్థల ముందడుగు

ఇప్పటివరకు ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు మాత్రమే నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అమెరికాలో తొలిసారిగా 'బీ సేఫ్ మస్కిటో కంట్రోల్' అనే ప్రైవేట్ కంపెనీ నేరుగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. వాషింగ్టన్ డీసీ, మేరీల్యాండ్‌లోని సుమారు 25 ఇళ్ల ఆవరణలో ప్రతి వారం 1,500 చొప్పున ఈ ప్రత్యేక దోమలను విడుదల చేస్తున్నారు. కీటకనాశకాలు చల్లడం వల్ల ఇతర పురుగులు, జీవులకు హాని కలుగుతుందని, కానీ ఈ పద్ధతి కేవలం దోమలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు టాడ్ మోంట్‌గోమరీ తెలిపారు.

### విదేశాల్లో విజయవంతం.. భారత్‌కు ఆశాకిరణం

ఈ వోల్బాకియా టెక్నాలజీ సింగపూర్‌లో ఇప్పటికే అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. ఈ పద్ధతిని అమలు చేసిన ప్రాంతాల్లో దోమల జనాభా 90 శాతం వరకు తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీని విజయంతో గూగుల్ మాతృ సంస్థ 'ఆల్ఫాబెట్' కూడా కాలిఫోర్నియా, ఫ్లోరిడాలో ఇలాంటి ప్రయోగాలు చేసేందుకు అనుమతులు కోరుతోంది. ఉత్పత్తి ఖర్చులు, లాజిస్టిక్స్ వంటి సవాళ్లు ఉన్నప్పటికీ, పర్యావరణ హితమైన ఈ పద్ధతికి ఆదరణ పెరుగుతోంది. వాతావరణ మార్పుల కారణంగా డెంగ్యూ, జికా, వెస్ట్ నైల్ వైరస్ వంటి వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ఈ టెక్నాలజీ దోమల నియంత్రణకు ఒక ప్రభావవంతమైన మార్గంగా మారే అవకాశం ఉంది.

# తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్.. వేలాదిగా పేరుకుపోయిన దరఖాస్తులు

తెలంగాణలో పేరుకుపోతున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ దరఖాస్తులు

రెండు రోజుల్లో జారీ చేయాలన్న నిబంధన అమలు కాని వైనం

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో 50,000కు పైగా దరఖాస్తులు

హైదరాబాద్, సింధూరదర్శిని:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గడువు పాటించకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ పథకం ప్రారంభమైన జూలై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో, వారు నిత్యం మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల 25న విడుదల చేసిన జీవో 172 నిబంధనల ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు వాటిని పరిశీలించి సర్టిఫికెట్లను జారీ చేయాలి. అయితే, పలు ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు.

### సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ఇదే

పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారం ఆధారంగా ప్రభుత్వం 'తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్'ను సిద్ధం చేసింది. పౌరులు మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోగానే, ఆ దరఖాస్తు నేరుగా సంబంధిత తహశీల్దార్ లాగిన్‌లోకి వెళ్తుంది. అక్కడ తహశీల్దార్ ఆ వివరాలను రేషన్ కార్డు డేటాతో సరిపోల్చి చూసి, అంతా సక్రమంగా ఉంటే డిజిటల్ సంతకంతో ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలి. కానీ, తహశీల్దార్ల స్థాయిలో ఈ ప్రక్రియ మందకోడిగా సాగుతుండటంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పేరుకుపోతోంది.

# సినిమా న్యూస్

## మూవీ రివ్యూ : శ్రీనివాస మంగాపురం

'శ్రీనివాస మంగాపురం' మూవీ రివ్యూ వీశీజఱవం నటీనటులు: ఘట్టమనేని జైకృష్ణ- రాషా తడాని- మోహన్ బాబు- కిక్ శ్యామ్- వాసుకి- అజయ్- మహేంద్రన్- శ్రీతేజ్- నరేష్- బ్రహ్మాజీ తదితరులు సంగీతం: జి.వి.ప్రకాష్ కుమార్ ఛాయాగ్రహణం: జయకృష్ణ గుమ్మడి నిర్మాత: పి.కిరణ్ రచన-దర్శకత్వం: అజయ్ భూపతి తెలుగు సినీ రంగంలోకి మరో వారసుడు అడుగుపెట్టాడు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు.. రమేష్ బాబు తనయుడైన ఆ కుర్రాడే జైకృష్ణ ఘట్టమనేని. 'ఆర్ఎక్స్'.. 'మంగళవారం' చిత్రాలతో మెప్పించిన యువ దర్శకుడు అజయ్ భూపతి.. జైకృష్ణను హీరోగా పరిచయం చేస్తూ రూపొందించిన చిత్రం.. శ్రీనివాస మంగాపురం. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా జైకృష్ణకు కోరుకున్న విజయాన్నిచ్చేలా ఉందా? తెలుసుకుందాం పదండి. కథ: శ్రీను (జైకృష్ణ) కొత్తగా తిరుపతిలో అడుగు పెట్టిన కుర్రాడు. అతను సిటీలో ఉన్న చాలా పెద్ద వ్యక్తుల్లో ఒకడైన పెద్దిరెడ్డి (కిక్ శ్యామ్) కూతురైన మంగ (రషా తడాని)ను తొలి చూపులోనే ప్రేమిస్తాడు. అదే పనిగా తన వెంట పడుతున్న శ్రీనును మంగ మొదట పట్టించుకోదు. తర్వాత అతను చేసిన ఒక సాయం వల్ల ఫ్రెండుగా అంగీకరిస్తుంది. తర్వాత మంగకు శ్రీను ప్రపోజ్ చేయగా.. ఆమె తిరస్కరిస్తుంది. తనకు ఆల్రెడీ పెళ్లి ఫిక్స్ అవడంతో.. ఆ వివాహమే చేసుకోవాలనుకుంటుంది. కానీ శ్రీను.. పట్టువదలడు. అసలు అతను తిరుపతికి వచ్చిందే మంగకోసమని తెలుస్తుంది. ఇంతకీ శ్రీను ఎవరు.. తన కథేంటి.. మంగతో తనకున్న కనెక్షన్ ఏంటి.. అతను కోరుకున్నట్లుగా మంగను దక్కించుకున్నాడా అన్నది మిగతా కథ. ాాంజవతీఅంవఎవత్ కథనం-విశ్లేషణ: చాలామంది దర్శకులు మొదట్లో బలమైన ముద్ర వేసి.. ఒక దశ దాటాక గాడి తప్పుతుంటారు. ఆ గాడి తప్పడానికి ముందు వరకు హిట్టు సినిమా తీసినా, ఫ్లాప్ తీసినా.. ఒక ముద్ర ఉంటుంది. ఐతే 'ఆర్ఎక్స్ 100'తో సెన్సేషన్ క్రియేట్ చేసిన అజయ్ భూపతి మాత్రం రెండో సినిమా 'మహాసముద్రం'లో తన మార్కును కనీస స్థాయిలో కూడా చూపించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. దీంతో అతను వన్ ఫిల్మ్ వండర్ అనుకున్నారంతా. కానీ మూడో చిత్రం 'మంగళవారం' చూశాక అజయ్ భూపతి మామూలోడు కాదనిపించింది. ఘట్టమనేని కుటుంబం నుంచి వస్తున్న కొత్త వారసుడు జైకృష్ణను ఇలాంటి దర్శకుడి చేతిలో పెట్టారంటే తన అరంగేట్రం అదిరిపోతుందని అనుకున్నారంతా. కానీ ఈ కలయికలో వచ్చిన 'శ్రీనివాస మంగాపురం' ప్రోమోలు చూస్తే ఏ ప్రత్యేకతా కనిపించలేదు. ఐతే అజయ్ నేరుగా వెండితెర మీదే మెరుపులు మెరిపిస్తాడేమో అని ఆశిస్తే.. 'మహాసముద్రం' తరహాలోనే ఏమాత్రం తన మార్కు లేని సినిమాను అందించాడీ దర్శకుడు. కొత్త హీరో చూపించిన స్పార్కును అజయ్ భూపతి చూపించకపోవడంతో 'శ్రీనివాస మంగాపురం' సాధారణ చిత్రంగా మిగిలిపోయింది. వీశీజఱవం మహేష్ బాబు 'శ్రీనివాస మంగాపురం' చూసి ఆరు లవ్ ఎమోజీలు పంపాడంటూ గర్వంగా చెప్పుకున్నాడు అజయ్ భూపతి. నిజంగా ఈ సినిమా మహేష్ బాబుకు నచ్చి ఉంటే ఆయన టేస్టును సందేహించాల్సి ఉంటుంది. విడుదలకు సిద్ధమైన సినిమా విషయంలో ఏమీ చేయలేక మొహమాటంతోనే మహేష్ ఆ ప్రేమను చూపించి ఉండాలి. ఎందుకంటే రెండున్నర గంటల నిడివి ఉన్న ఈ సినిమాలో ఎక్కడా రవ్వంత కొత్తదనం లేదు. ఏమాత్రం ఎమోషన్ వర్కవుట్ కాలేదు. భలే ఉందే అనిపించిన సన్నివేశం ఇందులో ఒక్కటీ లేదు. ఏ పాత్రా ఆకట్టుకోలేదు. అసలు క్యారెక్టర్ రోల్స్ చేయడమే మానేసిన మోహన్ బాబు లేక లేక ఈ సినిమా చేశాడంటే.. ఆయన చేసిన వెంకటప్ప నాయుడు క్యారెక్టర్లో అయినా ఏదైనా విశేషం ఉంటుందేమో అని ఆశిస్తే.. అదీ తీవ్రంగా నిరాశపరుస్తుంది. విపరీతమైన బిల్డప్ తో మోహన్ బాబును పరిచయం చేసిన తొలి సన్నివేశమే తేలిపోయాక ఈ సినిమాలో ఏదీ వర్కవుట్ అయ్యేలా లేదని అర్థమైపోతుంది. ఇక జైకృష్ణ-రాషా తడానిల కెమిస్ట్రీ కూడా పండకపోవడం.. వారి మధ్య ప్రేమకథ టెంప్లేట్ లవ్ స్టోరీలనే తలపించడంతో 'శ్రీనివాస మంగాపురం' ఎక్కడా నెక్స్ట్ గేర్లోకి వెళ్లలేకపోయింది. ఇటు ప్రేమకథా పండక.. అటు యాక్షన్ ఘట్టాలూ ఇంపాక్ట్ వేయక ఈ సినిమా ప్రేక్షకులను నీరసించిపోయేలా చేస్తుంది. 'శ్రీనివాస మంగాపురం' స్టోరీ లైన్ కొత్తది కాదు కానీ.. కొంచెం ఆసక్తి రేకెత్తించేదే. 'హాయ్ నాన్న'ను గుర్తుకు చేసే మూల కథకు సరైన స్క్రీన్ ప్లే తోడై ఉంటే ఇంట్రెస్టింగ్ గా ఉండేదే. ఆర్ఎక్స్ 100.. మంగళవారం చిత్రాల్లో కథనం.. టేకింగ్ పరంగా మెరుపులు మెరిపించిన అజయ్ భూపతి.. ఇక్కడా ఆ స్టైల్లో కథను చెప్పే ప్రయత్నం చేసి ఉంటే.. 'శ్రీనివాస మంగాపురం' స్పెషల్ ఫిలిమే అయ్యుండేది. కానీ అతను చాలా మామూలుగా సినిమాను నడిపించేశాడు. ఆరంభ సన్నివేశాలతోనే రొటీన్ ఫీల్ తీసుకొచ్చే ఈ సినిమా.. ఏదో ఒక దశలో పుంజుకుంటుందని ఆశిస్తాం. సగం సినిమా వరకు కథలో ఏ కదలికా లేక.. రొటీన్ పాటలు-ఫైట్లతో విసుగు పుడుతుంది. అప్పటిదాకా కథ పెద్దగా రివీల్ కాకపోవడం.. మోహన్ బాబు కూడా రంగప్రవేశం చేయకపోవడంతో ద్వితీయార్థం మీద ఆశలు కలుగుతాయి.




కానీ మోహన్ బాబు పాత్ర వచ్చాక కూడా పెద్దగా కదలిక లేకపోవడం.. ఫ్లాష్ బ్యాక్ కూడా రొటీన్ గా సాగిపోవడంతో సినిమా గ్రాఫ్ పెరగదు. హీరో హీరోయిన్లు భారమైన డైలాగులు చెబుతుంటారు కానీ.. ఆ పాత్రలతో కనెక్ట్ కానపుడు వారి ప్రేమను ఎలా ఫీలవుతాం? ముఖ్యంగా హీరోయిన్ పాత్ర- అందులో నటించిన ఆర్టిస్టుతో కనెక్ట్ కాకపోతే ప్రేమకథ పండడం చాలా కష్టం. 'శ్రీనివాస మంగాపురం'లో సరిగ్గా అదే జరిగింది. జైకృష్ణ తన పెర్ఫామెన్సుతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించినా.. దర్శకుడు అజయ్ భూపతి మాత్రం కథాకథనాలతో అతడికి ఇవ్వాల్సిన పుష్ ఇవ్వలేకపోయాడు. జైకృష్ణ పెర్ఫామెన్స్.. కొన్ని మాస్-యాక్షన్ సీన్లు.. సంగీతం.. నిర్మాణ విలువలను మినహాయిస్తే 'శ్రీనివాస మంగాపురం'లో విశేషాలేమీ లేవు. నటీనటులు: జైకృష్ణలో స్టార్ అవ్వగల లక్షణాలున్నాయి. కుర్రాడు ఒడ్డూ పొడవూ బాగున్నాడు. పెర్ఫామెన్స్ కూడా డీసెంటుగా సాగింది. నేరుగా స్టార్ అయిపోవాలని చూడకుండా.. బిల్డప్పుల్లేని సింపుల్ కుర్రాడి పాత్రలో ఒదిగిపోయే ప్రయత్నం చేశాడు. హీరోయిజం చూపించే సన్నివేశాల్లో రాణించాడు. ఎమోషనల్ సీన్లలో నటన ఓకే. హీరోయిన్ రాషా తడాని మాత్రం సినిమాకు మైనస్ అయింది. తెలుగింటి అమ్మాయి అనిపించేలా లేకపోవడం వల్ల తన పాత్ర పండలేదు. లుక్స్ పరంగా రాషా చాలా యావరేజ్ అనిపిస్తుంది. తన నటన కూడా గొప్పగా ఏమీ లేదు. జయకృష్ణతో ఆమెకు జోడీ కుదరలేదు. మోహన్ బాబు నటన బాలేదు అనడానికి లేదు కానీ.. ఆయన్ని దర్శకుడు ఉపయోగించుకోలేకపోయాడు. గెటప్ బాగున్నా.. పాత్రలో బలం లేకపోవడంతో మోహన్ బాబు సినిమాకు బలం కాలేకపోయారు. వాసుకి కీలక పాత్రలో రాణించింది. నరేష్ పాత్ర మొదట్లో గమ్మత్తుగా అనిపిస్తుంది కానీ.. తర్వాత దాన్ని తేల్చి పడేశారు. కిక్ శ్యామ్.. అజయ్.. వడ్లమాని శ్రీనివాస్.. బ్రహ్మాజీ.. వీళ్లెవ్వరూ ప్రత్యేకతను చాటుకోలేకపోయారు. సాంకేతిక వర్గం: కొత్త హీరో సినిమాను మంచి క్వాలిటీతో తీశారు. ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి. జి.వి.ప్రకాష్ కుమార్ పాటలు.. బీజీఎం బాగున్నాయి. అతను సినిమా కోసం మంచి ఎఫర్ట్ పెట్టాడు. జయకృష్ణ గుమ్మడి ఛాయాగ్రహణం కూడా ఆకట్టుకుంటుంది. విజువల్స్ ఆద్యంతం బాగున్నాయి. కానీ అన్ని వనరులూ బాగానే సమకూరినా.. రైటర్ కమ్ డైరెక్టర్ అజయ్ భూపతి మాత్రం ఉపయోగించుకోలేకపోయాడు. భిన్నంగా ఏదో ప్రయత్నిస్తాడు.. సర్ప్రైజ్ చేస్తాడు అని తన మీద అంచనాలు పెట్టుకునే ప్రేక్షకులను అతను తీవ్ర నిరాశకు గురి చేశాడు. కొత్త హీరోతో తన స్టయిల్లో ట్రెండీ సినిమా తీస్తాడని ఆశిస్తే.. తనకున్న ఇమేజ్ కు భిన్నంగా అతను రొటీన్ సినిమా తీశాడు. స్క్రిప్టులో కానీ.. టేకింగ్ లో కానీ అతను ఎక్కడా తన ప్రత్యేకతను చాటుకోలేకపోయాడు. వీశీజఱవం చివరగా: శ్రీనివాస మంగాపురం.. రొటీన్ లవ్ స్టోరీ రేటింగ్- 2.25/5

## పెద్ద హీరోలతో పోటీకి కిరణ్ రెడీ.. ధైర్యమా, రిస్కా?




కిరణ్ అబ్బవరం తన కెరీర్లో ఒకేసారి రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నారనే చర్చ టాలీవుడ్లో వినిపిస్తోంది. కిరణ్ స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. వాస్తవానికి ఆ సినిమా సెప్టెంబర్ లో రిలీజవాల్సింది కానీ ఇప్పుడు దాన్ని సెప్టెంబర్ నుంచి సంక్రాంతి బరిలోకి తీసుకురావడం పెద్ద వ్యూహాత్మక రిస్క్గా కనిపిస్తోంది. సాధారణంగా పండగ సీజన్ అంటే స్టార్ హీరోల భారీ సినిమాల ఆధిపత్యం ఉంటుంది. అలాంటి టైమ్లో ఒక కామెడీ ఎంటర్టైనర్తో రంగంలోకి దిగడం కిరణ్ అబ్బవరం లెక్కలపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో యాక్షన్, పాన్ ఇండియా, మాస్ సినిమాల హవా ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, పండగ సీజన్లో ఫ్యామిలీ ఆడియన్స్ను ఆకట్టుకునే కామెడీ సినిమాలకు ఎప్పుడూ ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ముఖ్యంగా సంక్రాంతి సీజన్ లో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు పెద్ద సంఖ్యలో వస్తారు. ఈ నేపథ్యంలో యాక్షన్ కాకుండా కామెడీ జానర్ కావడంతో ఆ సినిమాకు సంక్రాంతి సీజన్ను ఎంచుకోవడం కూడా ఆలోచించి తీసుకున్న డెసిషన్ గానే సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే అసలు రిస్క్ డైరెక్టర్గా మారడంలోనే ఉంది. నటుడిగా ఒక పాత్రకు బాధ్యత వహించడం వేరు, డైరెక్టర్గా మొత్తం సినిమాను మోయడం వేరు. కథ, స్క్రీన్ప్లే, కామెడీ టైమింగ్, ఎమోషనల్ బ్యాలెన్స్, నటీనటుల పనితీరు, సాంకేతిక విభాగాల సమన్వయం వంటి ప్రతి అంశంపై పూర్తి బాధ్యత డైరెక్టర్పైనే ఉంటుంది. అందుకే హీరో నుంచి డైరెక్టర్గా మారే ప్రయత్నాన్ని ఇండస్ట్రీలో ఎప్పుడూ సవాల్గా చూస్తారు. దీనికి తోడు రిలీజ్ టైమింగ్ను మార్చడం మరో కీలక నిర్ణయం. సెప్టెంబర్లో రిలీజయ్యే సినిమా సంక్రాంతికి వాయిదా పడితే పోటీ స్థాయి పూర్తిగా మారిపోతుంది. పెద్ద సినిమాలు, భారీ ప్రమోషన్లు, ఎక్కువ స్క్రీన్ల కోసం పోటీ వంటి అంశాలు సహజంగానే ప్రెజర్ను పెంచుతాయి. అయినప్పటికీ, సంక్రాంతి సీజన్లో సక్సెస్ ను అందుకుంటే దాని ఇంపాక్ట్ కూడా అంతే భారీగా ఉంటుంది. సాధారణ సీజన్లో వచ్చే హిట్ కంటే పండగ సీజన్లో వచ్చే హిట్కు మార్కెట్ వాల్యూ ఎక్కువగా ఉంటుంది. కొత్తసినిమాలు ఇక్కడే రిస్క్కు తగిన రివార్డ్ అవకాశం కనిపిస్తోంది.

ఒకవేళ సినిమాలో మంచి కంటెంట్ ఉండి, కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుని, ఫ్యామిలీ ఆడియన్స్కు కనెక్ట్ అయితే సంక్రాంతి సీజన్లో భారీ కలెక్షన్లు సాధించే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. మౌత్ పబ్లిసిటీ బలంగా పనిచేస్తే పెద్ద సినిమాల మధ్య కూడా ఒక మంచి కామెడీ ఎంటర్టైనర్ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవచ్చు. అందుకే కిరణ్ అబ్బవరం తీసుకున్న ఈ డెసిషన్ సాధారణ రిలీజ్ ఛేంజ్గా కాకుండా, డైరెక్టర్గా తనను తాను నిరూపించుకోవాలనే డేరింగ్ డెసిషన్గా సినీ విశ్లేషకులు చూస్తున్నారు. ఈ రిస్క్ చివరికి ఎంత పెద్ద రివార్డ్గా మారుతుందనేదే దానిపైనే ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

## రామాయణం ట్రైలర్.. ఇంతకీ రెస్పాన్స్ ఎలా ఉంది?

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం రామాయణం పార్ట్ 1 ట్రైలర్ ఉదయం నుంచి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. అయితే ఈ వీడియో చూసిన ఆడియన్స్ నుంచి ఒకే రకమైన పాజిటివ్ రెస్పాన్స్ రావడం లేదు. కొంతమంది నెటిజన్లు ఈ ట్రైలర్ ను మెచ్చుకుంటుంటే ఇంకొందరు మాత్రం పలు విషయాల్లో తమ అసంతృప్తిని బయటపెడుతున్నారు. ఓవరాల్ గా ఈ ట్రైలర్ మీద నెట్టింట మిక్స్డ్ రియాక్షన్స్ గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ట్రైలర్ చూసిన తర్వాత నెటిజన్ల మధ్య ముఖ్యంగా రణబీర్ కపూర్, యష్ ల గురించే పెద్ద చర్చ నడుస్తోంది. పవర్ ఫుల్ విలన్ రోల్ లో పాన్ ఇండియా స్టార్ యష్ స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోయిందని కామెంట్స్ వస్తున్నాయి. రాముడిగా రణబీర్ కపూర్ లుక్ బాగానే సెట్ అయినప్పటికీ యష్ మాత్రం రావణ్గా తన ఆటిట్యూడ్ తో రణబీర్ ను పూర్తిగా డామినేట్ చేశాడనే టాక్ నడుస్తోంది. ఒక అహంకారం ఉన్న లంక రాజుగా యష్ గెటప్ ఈ ప్రోమోకే హైలైట్గా నిలిచిందని చాలామంది నెటిజన్లు తమ అభిప్రాయాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. ఇక ఈ ప్రాజెక్ట్ లో సీతమ్మ పాత్రలో నటించిన సాయి పల్లవి విషయానికి వస్తే ఆడియన్స్ నుంచి భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. సినిమాటిక్ గా కాకుండా ఎంతో సహజంగా ఉన్న ఆమె లుక్ ఈ క్యారెక్టర్ కు కరెక్ట్ గా సరిపోయిందని ఒక వర్గం ఫ్యాన్స్ సపోర్ట్ చేస్తున్నారు. దానికి భిన్నంగా ఇంకొందరు మాత్రం ఇంత భారీ సినిమాలో సీత క్యారెక్టర్ కు ఆమె అంతగా సెట్ కాలేదని ఓపెన్ గానే చెబుతున్నారు. ఇలా ఆమె కాస్టింగ్ పైన సోషల్ మీడియా వేదికగా రెండు రకాల వాదనలు కనిపిస్తున్నాయి. కొత్తసినిమాలు ఈ ట్రైలర్ లో చాలామంది అభిమానులు ఫీల్ అయిన మరో ప్రధానమైన లోపం హనుమంతుడి క్యారెక్టర్ కనిపించకపోవడం. రామాయణం లాంటి ఇతిహాసంలో అత్యంత కీలకమైన హనుమాన్ పాత్రను ఈ ఫస్ట్ ప్రోమోలో ఎక్కడా రివీల్ చేయలేదు. వానర సైన్యాన్ని చూపించిన మేకర్స్ ఆ మహా భక్తుడిని మాత్రం దాచిపెట్టడం కొంత నిరాశకు గురిచేసింది. ఆ ఎంట్రీ లేకపోవడంతో ఈ వీడియో చూస్తున్నంత సేపు ఏదో ఇన్ కంప్లీట్ గా ఉందనే ఫీలింగ్ కలుగుతోందని నెటిజన్లు మేకర్స్ కు తమ ఫీడ్ బ్యాక్ ఇస్తున్నారు. సినిమా టెక్నికల్ వాల్యూస్ పైన కూడా ఇలాంటి డివైడ్ టాకే నడుస్తోంది.



ఇంటర్నేషనల్ స్టూడియోస్ తో కలిసి వేల కోట్ల బడ్జెట్ తో తీస్తున్న సినిమా కావడంతో జనాలు విజువల్స్ పైన చాలా ఆశలు పెట్టుకున్నారు. కానీ ట్రైలర్ లోని గ్రాఫిక్స్ వీఎఫ్ఎక్స్ వర్క్ కొందరికి నచ్చితే ఇంకొందరికి మాత్రం అంచనాలకు తగ్గట్లుగా లేవనిపిస్తోంది. అలాగే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ విషయంలో కూడా పూర్తి స్థాయిలో పాజిటివ్ ఫీడ్ బ్యాక్ రావడం లేదు. రెహమాన్ సంగీతం బాగున్నా ఇంకా బెటర్ గా ఉండాల్సిందనే కామెంట్స్ వస్తున్నాయి. ఒక భారీ పౌరాణిక కథను సినిమాగా తీసుకువస్తున్నప్పుడు జనాల్లో అంచనాలు మామూలుగా ఉండవు. ఇలాంటి ప్రాజెక్ట్ కు సంబంధించి ఏ చిన్న అప్డేట్ ఇచ్చినా దానిపై ప్రతి ఒక్కరూ తమ సొంత కోణంలో గమనిస్తూ ఉంటారు. ఇప్పుడు రామాయణం ట్రైలర్ పై వస్తున్న ఈ మిక్స్డ్ రియాక్షన్స్ కూడా అందులో భాగమే అని చెప్పుకోవచ్చు. ఏదేమైనా కేవలం ఒక చిన్న వీడియో చూసి సినిమా రిజల్ట్ ను అంచనా వేయలేము. పూర్తి స్థాయి సినిమా థియేటర్లలోకి వచ్చిన తర్వాత మాత్రమే ఈ ప్రాజెక్ట్ అసలు స్థాయి ఏంటో అర్థమవుతుంది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662